స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

బన్సీలాల్‌పేట్, మార్చి 31: పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్ల పక్కన ఉండే నిరాశ్రయులు, అనాథలకు దుస్తులు,పాదచారులకు, ఆర్‌టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు అంబలి, తాగునీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. నగరంలో ఎండలు తీవ్రంగా ఉండటంతో తాము ప్రతి ఆదివారం అంబలి, తాగునీరు పంపిణీ చేస్తున్నామని స్కైఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు పావని తెలిపారు. సభ్యులు అఖిల్, హరీశ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నేతలు

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, తదితరులు

అడ్డగుట్ట, మార్చి 31 : టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న లోక్‌సభ ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేసినట్లు ఆదం సంతోష్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగిరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సీనియర్ నేతలు మేరి రవీంద్రనాథ్, కట్టెల శ్రీనివాస్‌యాదవ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదం సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

• సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్, మార్చి 31 : ఆధ్యాత్మిక చింతన ద్వారానే ప్రశాంతత లభిస్తుందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తన సొంత నిధులతో పద్మారావునగర్‌లో పునర్ నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారి పూజల్లో పాల్గొనగా అర్చకులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు సాయిరామ్ చారి, హరిచారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సికింద్రాబాద్ జిల్లా సాధన కమిటీ అధ్యక్షుడు జి.పవన్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కే.లక్ష్మిపతి, వెంకటేశన్ రాజు తదితరులు పాల్గొన్నారు. ఆలయ పునర్ నిర్మాణానికి సహకారం అందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసానికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఎమ్మెల్యే తలసానిని కలిసిన సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

బన్సీలాల్‌పేట్ : ఆలయ అభివృద్ధికి పాటుపడుతూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేందుకు నూతన కమిటీ కృషి చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం తన నివాసంలో న్యూబోయిగూడలోని సాయిబాబా మందిరం నూతన కమిటీ అధ్యక్షుడు బి.మహేశ్, సభ్యులు తలసానిని కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బి.మహేశ్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి అభినందించారు. ఆలయంలో భక్తులకు అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని సూచించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మినారాయణ, ఉపాధ్యకులు భగత్ శ్రీను, సతీశ్, శంకర్, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ పాండు, కోశాధికారి జీబీ సాయికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రాజేందర్, జ్ఞాని, సురేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

• బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత • కాకాగూడలో జిమ్ ప్రారంభం

కాకాగూడ అంబేద్కర్ భవన్‌లో జిమ్‌ను ప్రారంభించిన బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, పాల్గొన్న నాయకులు

మారేడ్‌పల్లి, మార్చి 31: కంటోన్మెంట్ ఐదవ వార్డులోని కాకాగూడ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్‌ను ఆదివారం బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత ప్రారంభించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులతో స్థానింగా ఏర్పాటు చేసిన జిమ్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బస్తీ వాసులకు నివేదిత హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి ఆలయ పాలక మండలి సభ్యుడు, బీఆర్ఎస్ నాయకులు చొల్లేటి రమేశ్, కిరణ్, శ్రీహరి, రేపాల వెంకటేశ్, మురళియాదవ్, మల్లేశ్, సంఘం ప్రెసిడెంట్ డీ. బాలకృష్ణ, జనరల్ సెక్రటరీ భిక్షపతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకలు

బొల్లారం, మార్చి 31: తిరుమలగిరి గ్యారీసన్ వెస్లీ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం పాస్టర్ జోసఫ్ భక్తులకు సందేశం ఇచ్చారు.

కంటోన్మెంట్‌లో..

కంటోన్మెంట్ : నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. న్యూ బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ మూర్తి, నాగేశ్వర్‌రావు ఆహ్వానం మేరకు ఈస్టర్ వేడుకలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీ గణేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం శ్రీ గణేశ్ మాట్లాడుతూ ఏసుప్రభువు దీవెనలు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని కోరారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

బన్సీలాల్‌పేట్, మార్చి 31 : భోలక్‌పూర్‌లో ఆదివారం మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు ఓటు హక్కు వినియోగం, ఓటరు నమోదుపై జీహెచ్ఎంసీ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బేగంపేట్ సర్కిల్ యూసీడీ విభాగం సీఓ ఎన్.నర్సింహ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మరోసారి ఓటరు నమోదుకు అవకాశం కల్పించామన్నారు. ఆఫీసుల చుట్టూ తిరిగే ఇబ్బంది లేకుండా జీహెచ్ఎంసీ యాప్ నుంచి ఓటు నమోదు చేసుకోవచ్చునని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా లభించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం వారితో ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు.

మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీహెచ్ఎంసీ అధికారి నర్సింహ

సికింద్రాబాద్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

సికింద్రాబాద్,మార్చి31: సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపు ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు గరికపాటి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఆయన సీతాఫల్‌మండిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా పద్మారావు పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించడంతోనే పజ్జన్న గెలుపు ఖాయమైందన్నారు. దీంతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక మొదటి సారి సికింద్రాబాద్‌లో గులాబీ జెండా ఎగురబోతుందన్నారు. కేంద్ర మంత్రిగా, ఎంపీగా ఉన్న కిషన్‌రెడ్డి ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. కిషన్‌రెడ్డి ఢిల్లీలోనే ఉంటూ గల్లీలో కనబడటం లేదని ఎద్దేవా చేశారు. పార్టీలు మార్చి ప్రజలను మోసం చేస్తున్న దానం నాగేందర్‌కు ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెప్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమాలు బీఆర్ఎస్ పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు కొత్తేమీ కాదని ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ గెలుపు కోసం తామంతా శాయశక్తులా కృషి చేస్తామని ఆయన చెప్పారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జీ.చంద్రశేఖర్

ల్యాప్‌టాప్‌లు, కుట్టుమిషన్ల పంపిణీ

మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు

అమీర్‌పేట్, మార్చి 31 : పేద విద్యార్థుల చదువుకు, కుట్లు అల్లికల్లో నైపుణ్యం సాధించిన మహిళలకు చేయూత ఫౌండేషన్ తన వంతుగా సాయం అందిస్తున్నది. ఆదివారం సనత్‌నగర్ జెక్‌కాలనీలోని ఎస్‌వీఎస్ఎస్ నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీ ఇన్నోసిస్టమ్ సొల్యూషన్స్ ఆర్థిక సహకారంతో(సీఎస్ఆర్ నిధులు) 25 మంది పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, 8 మంది మహిళలకు కుట్టుమిషన్లను అందజేశారు. జెక్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ మల్లు ప్రసాద్, ప్రదాన కార్యదర్శి డీఆర్ఎస్ చందు, కాలనీ ప్రతినిధులు డాక్టర్ వైవీ రాఘవయ్య, సంపత్, రమాదేవి, శేషగిరిరావు, సురేశ్, మాధవి, నవీన్, రమణి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి కల్యాణం

బొల్లారం, మార్చి 31: ఏడో వార్డు తిరుమలగిరి చంద్రపురి కాలనీలో వీరభద్రస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీ గణేశ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్

కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ ఆవిర్భావం

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 31: ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వేదికగా తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ ఆవిర్భవించింది. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల కాంట్రాక్ట్ ఉద్యోగులు సమావేశమై జేఏసీ ఏర్పాటు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జేఏసీని ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. దీనిపై త్వరలోనే కార్యాచరణను ప్రకటించనున్నట్లు వారు పేర్కొన్నారు.

దళితకవి ఇద్దాసుకు నివాళి

చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం తొలితరం దళితకవి దున్న ఇద్దాసు సంస్మరణ సభ జరిగింది. పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త ముఖ్యఅతిథిగా విచ్చేసి ఇద్దాసు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాయకుడు చింతలపూడి త్రినాథరావు, వినయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. - ముషీరాబాద్

దానగుణం ఉన్న మనిషిలో దైవత్వం ఉంటుంది..

దాన గుణం, నిబద్ధతతో జీవించే ప్రతి మనిషిలో దైవత్వం ఉంటుందని శ్రీ రామదూత స్వామి పేర్కొన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, దాంపత్యవ్రతం, వేణు దత్తాత్రేయ అభయమా మాలధారణ, దీక్షలను భగవాన్ శ్రీ రామదూత స్వామి ప్రారంభించారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సతీ సమేతంగా పూజలు చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈటెల రాజేందర్, దాసోజు శ్రవణ్‌కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, ఎంఎన్ఆర్ గ్రూపు విద్యా సంస్థల డైరెక్టర్, పారిశ్రామిక వేత్తలు, ధార్మిక, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు తరలి రాగా వారికి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. - అబిడ్స్, మార్చి 31

మద్యం బాటిళ్లు పట్టివేత

కాచిగూడ,మార్చి 31: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై డి. సుభాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్‌కు చెందిన రాములు కుమారుడు పిల్లి రాజేశ్ ఇంట్లో మద్యం అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని అతడి నుంచి 20 క్వార్టర్ బాటిళ్లు, 90 ఎంఎల్ 13 బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ,మార్చి 31: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాలు.. గుర్తుతెలియని వ్యక్తి (35) ఆదివారం సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-3లో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఛత్రినాక పరిధిలో కార్డెన్‌సెర్చ్

చాంద్రాయణగుట్ట, మార్చి 31 : ఛత్రినాక పీఎస్ పరిధిలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యతో అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక ఏసీపీ సీహెచ్ చంద్రశేఖర్, వంద మంది పోలీస్ సిబ్బందితో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా ఓ షాపులో విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు, మూడు కర్టెన్ల బీర్లు స్వాధీనం చేసుకున్నారు ఆపరేషన్‌లో ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మొగల్‌పుర డీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం సమావేశం

సుల్తాన్‌బజార్, మార్చి 31 : తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఆత్మీయ సమావేశాన్ని ఏప్రిల్ 1న నాంపల్లి గృహకల్ప ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ ఆదివారం తెలిపారు. సమావేశంలో కేంద్ర సంఘానికి ఆరోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన జ్ఞానేశ్వర్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వంజరి కులస్తుల సమస్యలు పరిష్కరించండి

• అఖిల భారత వంజరి సేవా సంఘం డిమాండ్

సికింద్రాబాద్,మార్చి 31: వంజరి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, తమ సమస్యలపై గళమెత్తే పార్టీలకు మద్దతు ఇస్తామని తెలంగాణ వంజరి సేవా సంఘం ప్రకటించింది. ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్‌లో వంజరి సేవా సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 75 ఏండ్లుగా పేదరికంలో కునారిల్లుతున్న వంజర్లకు ప్రభుత్వ పథకాల ద్వారా ఎటువంటి లబ్ధి చేకూరలేదన్నారు. ఎస్టీల్లో ఉన్న రిజర్వేషన్ తొలగించి బీసీ(డి)లో బలవంతంగా కలిపి వంజరుల అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని సవరించడానికి, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న వంజరులకు ఒకే రిజర్వేషన్ విధానం అవలంబించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం 17 బీసీ కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లుగానే వంజరి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో నివసిస్తున్న వంజర్లను ఆదుకోవడానికి ప్రత్యేక పథకం ప్రకటించాలని కోరారు. తమ సమస్యల పట్ల స్పందించే నాయకులకు మాత్రమే తమ మద్దతు ఉంటుందని, ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలని వారు ఉద్ఘాటించారు.

సమావేశంలో అఖిల భారత వంజరి సేవా సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సాల్వేరు కృష, తెలంగాణ అధ్యక్షుడు ఎదుగని శంకర్ నారాయణ, ప్రధాన కార్యదర్శి ధాత్రిక ధర్మరాజు, ఉపాధ్యక్షులు ఎదగని హరినాథ్, సూర్యనారాయణ, కార్యదర్శి గంగరాజు, నాయకులు కాలేరు సురేశ్, వంజరి టుడే ఎడిటర్ కాలేరు రూపాజ్యోతి, సాయి, రత్నమల్లు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వంజరి సేవా సంఘం నాయకులు

భద్రతా ప్రమాణాలు పాటించాలి

మెహిదీపట్నం, మార్చి 31 : రంజాన్ మాసంలో షాపింగ్ మాల్స్ యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించాలని దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మెహిదీపట్నంలోని డీసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దుకాణాల వారు వేళలను పాటిస్తూ వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. గోషామహల్, కుల్సుంపుర, ఆసిఫ్‌నగర్, గోల్కొండ ఏసీపీ డివిజన్ల పరిధిలో ఇబ్బంది కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మాల్స్‌లో పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

కచ్‌భుజ్‌కు రైలు సౌకర్యం కల్పించాలి

గుజరాత్‌లోని కచ్ భుజ్‌కు నేరుగా రైలు సౌకర్యం కల్పించాలని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రిథేశ్ జాగిర్దార్ జైన్ కోరారు. ఆదివారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఆయన జైన్ సమాజ్ సభ్యులు దినేశ్ గోసార్, దిలీప్ దాగాలతో కలిసి సమస్యలను విన్నవించారు. నగరంలో 5 లక్షలకు పైగా గుజరాతీలు ఉన్నారని, కచ్ భుజ్‌కు వెళ్లాలంటే రెండు, మూడు ట్రైన్లు మారాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా రైలు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

- సుల్తాన్‌బజార్, మార్చి 31

పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ సమీక్ష

కంటోన్మెంట్, మార్చి 31 : మల్కాజిగిరి పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీ గణేశ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు దేశానికి మలుపు అని ఆయన పేర్కొన్నారు. ఆదివారం కంటోన్మెంట్‌లోని మూడో వార్డు కార్ఖానాలో కాంగ్రెస్ నాయకుడు జమీల్ ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికల సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి యువ నాయకులు పట్నం రినేశ్‌రెడ్డి, శ్రీగణేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బలపరిచిన పట్నం సునీత మహేందర్‌రెడ్డితోపాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికలో ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ ఆయూబ్‌ఖాన్,ముంతాజ్ అలీఖాన్, అష్రఫ్, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్ఖానాలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీ గణేశ్

యువతకు సర్కారు పెద్దపీట..

రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు యువతకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తుందని కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీ గణేశ్ అన్నారు. ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లిలోని యువతతో శ్రీగణేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపుతోనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బద్దం బల్వంత్‌రెడ్డి(బీ బ్లాక్ ప్రెసిడెంట్), భానుమనోజ్, చందు, నాగరాజు, పలువురు యువకులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

మారేడ్‌పల్లి : కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ సీనియన్ నాయకుడు శ్రీ గణేశ్ అన్నారు. ఆదివారం మహేంద్రాహిల్స్‌లో జరిగిన రవి కాలనీ సోసైటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు.

కార్యక్రమంలో రవి కోఆపరేటివ్ హౌజింగ్ సోసైటీ అధ్యక్షుడు కొత్త సంజీవరెడ్డి, కాలనీ వాసులు శ్రీనివాస్‌రెడ్డి, మంగమ్మ, నర్సింగ్ రావు, చంద్రమోహన్, గోపాల్‌రెడ్డి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనలకు ఇబ్బందులు కలుగకుండా చూడండి

రంజాన్ రోజు జరుపుకునే సామూహిక ప్రార్థనల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఆదివారం ఎంపీతో సమావేశం అయ్యారు. ఇఫ్తార్‌పై చర్చించిన ఎంపీ మసీదులు, ఈద్గా మైదానాల్లో జరుగుతున్న పనులపై ఆరా తీశారు.

- మెహిదీపట్నం

మే 1 నుంచి వేసవి శిక్షణ శిబిరం

కాచిగూడ, మార్చి 31 : వేసవిలో చిన్నారులకు నృత్యం, లలిత సంగీతం, నటన, చిత్రలేఖనం అంశాల్లో నారాయణగూడ బాలనందం భవన్‌లో మే 1 నుంచి మే 31 వరకు శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు బాలనంద సంఘం అధ్యక్షురాలు జేవీ కామేశ్వరి తెలిపారు. తరగతులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు ఉంటాయని, ఆసక్తి గల వారు నేరుగా కార్యాలయంలో గాని, 040-2756 1443, www. balanandam. co.in వెబ్‌సైట్‌లో వివరాలు పొందు పరుచవచ్చని ఆమె సూచించారు.

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD
O.S. No. 175 OF 2024
Between:
Bondugula Nagaraju and others .... Plaintiffs
AND
The Tahsildar, Tirumalagiri Mandal and Other ...Defendants
To,
All Concerned
Whereas the plaintiffs herein above have filed the above Suit for Declaration of legal status to declare them as legal heirs of Bondugula Vishwanatham, who died on 28.10.2020. Anyone having any objection has to appear either in person or through pleader with defense if any on **15.04.2024 at 10:30 am** on the above said date before the Hon'ble court, failing which the suit will be heard and determined ex-parte and orders passed accordingly.
(BY ORDER OF THE COURT)
Sd/- **K. Yadagiri Rao,** Advocate, #207 & 208 Aditya Towers, Vinayaka Nagar, Neredmet, Sec-bad.